# మానవత్వం

పశువులు కొన్ని తాపీగా మేస్తున్నాయి. కొన్ని ఈతచెట్ల నీడన పడుకొని హాయిగా నెమరేస్తున్నాయి. దూరంగా చింతచెట్టు కింద తాత బీడీ తాగుతూ గత జీవితాన్నేమో నెమరేస్తున్నాడు. మిగిలిన ఇద్దరు పశువులు కాసే పిల్లలూ- భూమిని దున్నే ఆట ఆడుతున్నారు. ప్రతి రోజూ వీళ్ళు చేసే పని, పశువుల్ని తోలుకొచ్చి చాల దూరంగా వున్న పచ్చిక మైదానాలలో మేపడం, మధ్యాన్నం వేళ దాటుతూనే వంకలోకి రావడం, ఈతచెట్ల నీడన వున్న గడ్డిని మేపడం, కాసేపు అయిన తర్వాత తెచ్చుకున్న చద్దుల్ని ఆరగించడం, సాయంకాలం అవుతుండగానే వూరివైపు దారి మళ్ళించడం. ఈ పశువుల కాపర్లందరికీ నాయకుడు తాత. చెట్టు బోదెనో, బండరాయినో తన సింహాసనంగా చేసుకొని, అక్కడ్నించి దొంగగా చేనులోకి పోతున్న ఆవుల్ని మళ్ళించమని పిల్లలకి ఆజ్ఞలు జారీ చేస్తుంటాడు.

తాత పేరు చెన్నయ్య. తన పెద్దలు సంపాదించలేదు, తాను సంపాదించ లేదు, ఏ మాత్రం ఆస్తి. కండలున్నన్నాళ్ళు కూలి చేసుకొని కడుపు గడుపుకొన్నాడు. వృద్ధాప్యం ముసురుకొంటున్నందువల్ల కూలి పనులు మాని ఆవులు కాయడానికి వొప్పుకొని, పశువుల కాపరిగా మారాడు. తాత మంచితనం వల్లనేమో మిగతా పశువులు కాసే పిల్లలు తాత ఆవుల్తో తమ ఆవుల్ని కలుపుతారు.

"పిల్లగాళ్ళ నందర్నీ పిల్సురా ఓ బన్నా!.... పైటాలయింది.... బువ్వ తినేకి"- తాత కేకేసి చెప్పాడు.

పిల్లలంతా వచ్చారు. వాళ్ళ వాళ్ళ చద్దుల్ని తీసుకొన్నారు. రాముడు ముంత తీసికెళ్ళి నీళ్ళు తెచ్చాడు. రెండు ముద్దలు తిన్నారో లేదో.... ఏదో పడ్డట్టు శబ్దం. ఉలికిపడి చూశారు.

"కఱ్ఱావు కింద పడ్డది తాత.... ఏమయిందో?"

"ఔరా, పొద్దున్నించి అది యాదో వొగరకంగుంది.... గడ్డి గూడా సరిగ్గా మెయ్యలా. సూద్దాం పదండి."

పిల్లలు తిళ్ళుమాని అటుపరిగెత్తారు. ఆవులన్నీ కంగారుపడి, ఒక్కొక్కటే కఱ్ఱావు చుట్టూ చేరుతున్నాయి. అవి కఱ్ఱావు కోసం బాధ పడుతున్నట్టు నించున్నాయి.

"దీనికి కడుపునొప్పే మోరా— పోయ్ చిన్నయ్యగోర్ని పిల్సుకురా పోరా" ఓబన్నని వూళ్ళోకి తరిమాడు తాత.

* * *

రాత్రి, తాత అరుగు మీద కూర్చొని బీడీ అంటించుకొన్నాడు.

"అయ్యా.... ఎవురావు చచ్చిపోయిందంట" తాత కొడుకు రాగానే అడిగాడు.

"నాగప్పోల్ల కఱ్ఱావురా"

"ఏమయింది?"

"కడుపు నొప్పనుకొంటారా.... రామప్పతో పసరు గూడా పోయించినాము, కాని బతకలా. దాని రోజులు నిండినాయి."

"అవునయ్యా.... మనూర్లో పసులాస్పత్రి పెడతారని పెశిడెంటు సెప్పినాడే—"

"ఎపుడు పెడ్తారో ఏమో. ఓట్ల కోసమొచ్చినప్పుడేరా అవి 'కట్టిత్తాం, ఇవి కట్టిత్తాం' అనేది. ఆ తర్వాత అంతే.... దొంగ నా కొడుకులు"— భారత దేశంలో సగటు మనిషి అనే వుక్రోషపు మాటలని, బీడీని నెమ్మదిగా ఆర్పడంలో నిమగ్నమయ్యాడు. దాన్ని ఇంకోసారి తాగటానికి ఉపయోగ పడేట్టుగా.

"పెద్దయ్యా! బాగుండావా?" అన్న కొత్త మనిషి పలకరింపుతో తలెత్తి చూశాడు తాత.

"ఆఁ బాగున్నానప్పా. నువ్వు బాగుండావా? మీ యింట్లో అంతా బాగుండారా? ఇప్పుడెక్కడుండావు. బళ్ళారిలోనా? గుంతకల్లులోనా?

అంతలో— నర్శిమ్మడు ఎవర్నో బూతులు తిడుతూ వచ్చాడు- "దొంగముండ, ఇంతవస్త పడేకంటే యేట్లోదుంకరాదూ.... ఛీ, పాడు...."

"ఎవుర్నిరా.... తిడ్తుండావు?"

"ఇంకెవుర్ని....? రాములమ్మ నొప్పులొత్తంటూంది. నెలలు నిండినాయి కదా! ఇట్లాటి ముండల్ని వూర్లోంచి ఎల్లగొట్టాల తాతా!.... లేకపోతే వూరికి సిన్నతనం"

"అవున్రా! ఎట్లాంటోని కడుపులోంచి ఎట్లాంటి ముండ పుట్టిందిరా!" "నిట్టూర్చాడు తాత.

"ఎవురు పెద్దయ్యా! రాములమ్మ ఎవురు? ఏమయ్యింది?" అని కొత్త మనిషి ఆసక్తిగా అడిగాడు.

"కొత్తపల్లి అనమంతప్పని ఎరగవా? మిట్టమీద వుంది సూడు గుడిసె...."

"అనమంతప్పని ఎరక్కేం!"

"ఆఁ— ఆయప్ప రెండో బిడ్డే రాములమ్మ. మూడేండ్ల కిందట రాయదుర్గంలో వాళ్ళ దగ్గిర బంధువుకే యిచ్చి పెండ్లి సేసినాడు. వాడు సమచ్చరం తిరక్కుండానే ఎద్దుల బండ్లో వత్తావుంటే లారీ గుద్దుకొని సచ్చిపోయినాడు. మొగుడు సచ్చిపోతానే పుట్నిల్లు సేరింది యీయమ్మ. వొాగసారి ఈ పిల్ల మేనమామ సూసి పొయ్యేకి వచ్చినాడు. వాడు ఏమేమి నమ్మించినాడో యేమోగానీ, ఈ పిచ్చి ముండ నమ్మింది- వాడు గుడిసిమీద దెబ్బేసి యాటికో పరారయినాడు. అనుమంతప్పకి తల తీసేసి నట్టయింది. కూతుర్ని గొడ్లితో నరికేకి సూసినాడు గానీ సుట్టు పక్కల ఇండ్లోల్లు ఆపేసినారు. ఆ పొద్దుట్నుంచి కూతుర్ని ఇంట్లోకి రానియ్యలా. అదే అక్కడా ఇక్కడా పనులు చేసుకుని ఆడింత, ఈడింత అడుక్కుతిని ఆ గోడ కింద తలదాసు కొనేది. ఇప్పుడు నొప్పులొత్తింటూందింట.... దాని రాత అట్టా గుంది" అని మళ్ళీ నిట్టూర్చాడు.

"కాలం ఎట్టా వుందోసూడు పెద్దయ్యా! సెడిపోయింది పెద్దయ్యా కాలం.... కలికాలంలో నీతేందిలే" అని విచారించాడు. కొత్త (పాత) మనిషి.

"అంతే నాయినా— అంతే.... ఆ పారిపోయినోడు రావులమ్మని కూడా తీసుకుపోయినాడు గాదు. ఆడముండని మోసగించి పోతే ఎట్టా సస్తదనుకున్నాడో!" అని గొణిగాడు తాత.

"మంచి మాటన్నావు. ఇది అక్కడేం సేస్తదో ఎవుడి కెరిక?" అని లేచాడు కొత్త మనిషి.

తాత మనసు చివుక్కుమంది. రాములమ్మని తాత చిన్నప్పట్నించీ ఎరుగును. "అది అట్టాంటి మనిషి కాదయ్యా!" అనబోయి వూరుకున్నాడు. అట్టాంటి పని చేసిందయ్యే మరి.

వూరు సద్దు మణిగింది. తాత అరుగు మీద కంబళి పరుచుకుని నడుం వాల్చాడు. కునుకు పట్టబోయేసరికి దూరంగా ఏడుపు వినబడింది. రాములమ్మ కంఠమే అది. నొప్పులు ఎక్కువవుతున్నపుడల్లా బాధతో కేకలేస్తోంది రాములమ్మ. ఆ కేకలు తాత చెవికి సోకుతున్నాయి. వూరి సందడి తగ్గేకొద్దీ ఆమె బాధ మరీ స్పష్టంగా వినవస్తోంది. ఎందుకో తాత మనసు గుబులు, గుబులుగా వుంది. లేచి గొంతు కూర్చుని గోడ కానుకున్నాడు. బనీనులోంచి అంతకు మునుపు రెండు సార్లు తాగి జాగ్రత్తగా ఆర్పేసిన బీడీ ముక్క తీసి అంటించాడు.... మళ్ళీ బీడీ దూరంగా పారేసి నించున్నాడు. గబగబా నడిచాడు దారిమీదకి. బావి పక్క చెట్టుకింద రా ము ల మ్మ పడుకుని, పడుకోలేక దొర్లి ఏడుస్తోంది. ఒక్క ఆడ మనిషన్నా లేదు అక్కడ. చుట్టు పక్కల కొంపల్లోంచే ఆడోళ్ళు. పతివ్రతలైన వాళ్ళు. కాబోయే వాళ్ళు తొంగి తొంగి చూస్తున్నారుగానీ బయటి కడుగు బెట్టరు.

తాత రాములమ్మను దగ్గరగా వెళ్ళి చూశాడు. ఆ నిస్సహాయురాలు దీనంగా బాధతో తాత కేసి చూసింది. ఆమె కళ్ళల్లో వుబుకుతున్న నీటిని గుడ్డి వెన్నెల చూపించింది తాతకి. కడుపు తరుక్కు పోయింది.

"బాధగా వుందా అమ్మా?"

రాములమ్మ భోరున ఏడ్చింది.

"యాడవకేడవకు. ఓర్చుకో. వత్తానుండు" అని తాత గబగబా అంగ లేసుకుంటూ బయల్దేరాడు.

"సుబ్బమ్మా!.... సుబ్బమ్మో!" అని కేక లెట్టాడు.

"ఎవరయ్యో" అంటూనే తలుపు తీసింది. సుబ్బమ్మ.

"ఏమన్నా— ఇయ్యాల కాడొచ్చినావు ?"

"సూడమ్మ! పాపం ఆ రాములమ్మ నొప్పులొత్తంటుండాది. దానికి కానుపు జేసి పున్నెం కట్టుకో తల్లీ" అన్నాడు తాత ప్రాదేయపడుతూ.

సుబ్బమ్మ కొంచెం తెల్ల బోయింది- "రాములమ్మకి కానుపు జెయ్య మనేకి నీకి నోరెట్లొచ్చిందన్నా" అంది మొహం మాడ్చుకుంటూ.

"అదీ మనిషి కాదేమ్మా. ఎంత బాధపడతాందో వొచ్చి సూడు" నచ్చజెప్ప బోయాడు తాత. సుబ్బమ్మ కేమీ నచ్చినట్టు లేదు. "అనుమంతప్ప కోపగిస్తాడన్నా! నలుగురూ ఏమంటారు?"

తాతకి కోపం వచ్చింది— "మనిషి పుటకపుట్టలే. కస్టంలో ఆదుకోక పోతే.... సీ.... ఎదవ జన్మ" గిరుక్కున వెనక్కి తిరిగాడు. మళ్ళీ కోపం ఆగక సుబ్బమ్మ కేసి తిరిగి- కలిగినోళ్ళకైతే ఆళ్ళ పిల్లలెన్ని తప్పులు సేసినా రగస్యంగా కానుపు చేస్తవు. అది తప్పు లేదు నీకు" అనేసి చకచక నడిచాడు.

తాత ఇంటికి వచ్చి కొడవలి తీసుకొని వురుకులు పరుగుల మీద బావి దగ్గరికి పోయాడు, తనే కానుపు చేద్దామని. రాములమ్మ చూడలేనంత బాధపడతావుంది. తాత రాములమ్మ కడుపు సవరదీస్తూ "ఓర్చుకోయేఅమ్మా! ఓర్చుకో. ఏం పర్లేదు. అంతా అయిపోద్ది" అని ఓదారుస్తూ అన్నాడు చాలా సేపు.

రాములమ్మ గజ గజ వొణికి వెర్రి కేక పెట్టింది. అప్పుడే పిల్ల వచ్చి బయట పడింది. తాత కంగారు పడిపోయాడు. సంతోషంతో తబ్బిబ్బయి పోయాడు. రాములమ్మ ఏడుపు కొంచెం ఆగింది.

"ఏం చెయ్యనా?" అని తికమక పడుతున్నాడు తాత.

"నువ్వు లెయ్యన్నా నేను సూసుకుంటాను"- అంది సుబ్బమ్మ వెనకనించి.

చుట్టు పక్కల ఇళ్ళలో ఆడవాళ్ళు ఒక్కరొక్కరే బావి వేపు వొస్తున్నారు.

తాత లేచి దూరంగా నిలబడ్డాడు. *

(1977 అక్టోబరు, ప్రజాసాహితి)